ప్రజాశక్తి

శుక్రవారం 31 అక్టోబర్ 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

వరద భయం



కీసర బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు

- ప్రకాశం బ్యారేజీ, మున్నేరుకు పెరుగుతున్న ప్రవాహం
- తీర ప్రాంతాలు జలమయం
- నీటమునిగిన పంటలు
- అధికారులు అప్రమత్తం

ప్రజాశక్తి-కంచికచర్ల, నందిగామ, వత్సవాయి

మొంథా తుపాన్‌కు ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు ప్రకాశం బ్యారేజీ, మున్నేరుకు వరద పోటెత్తుతుంది. తెలంగాణాలోని ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మునేరు, వైరాఏరు, కట్లేరులకు భారీగా వరద చేరింది. గురువారం ఉదయం నుండి మున్నేరుకు వరద క్రమంగా పెరిగింది. మధ్యాహ్నంకు కీసర బ్రిడ్జి వద్ద 14..2 మీటర్ల ఎత్తులో 1,36,669 క్యూసెక్కుల వరద నీరు దిగువ కృష్ణా నదిలోకి చేరుతుందని సీడబ్ల్యూసి అధికారులు తెలిపారు. లింగాల కాజ్‌వేపై, పోలంపల్లి చెక్‌డ్యామ్ వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. చిట్యాల వంతెన వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్ద మున్నేరులోకి ఎవరు వెళ్లకుండా అధికారులు గేట్లు మూయించి వేశారు. వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు హెచ్చరించటంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మున్నేరు ప్రవాహం పెరిగితే కంచికచర్ల-నందిగామ మధ్య ఐతవరం వద్ద జాతీయ రహదారిపై వరద చేరి హైదరాబాద్-విజయవాడ మార్గంలో రాకపోకలు (మిగతా 2లో)



కీసర వద్ద పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపి

బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

- ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 5.82 లక్షల క్యూసెక్కులు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: ప్రకాశం బ్యారేజీ ఎగువన ఎన్టీఆర్ జిల్లాతో పాటు ఖమ్మం జిల్లాలో వర్షాలు దంచికొట్టాయి. దీంతో మున్నేరు వాగు తీవ్రస్థాయిలో పొంగి ప్రవహిస్తుంది. పులిచింతల నుంచి సుమారు 5 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానదికి వరద ప్రవాహం భారీగా పెరిగింది. గురువారం రాత్రి ఎనిమిది గంటల సమయానికి బ్యారేజీకి ఇన్‌ఫ్లో 5,82,710 క్యూసెక్కుల కొనసాగుతుండగా (మిగతా 2లో)



వరదను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల



పంట నష్టంపై అవనిగడ్డలో ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

అవనిగడ్డ నష్టంపై వ్యక్తిగతంగా సమీక్ష

- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- ఎదురుమొండి రోడ్డు పనులకు రూ.13.8 కోట్లతో టెండర్లు ఖరారు

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ నియోజకవర్గ నష్టాన్ని వ్యక్తిగతంగా సమీక్షించి నివేదిక పంపుతానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఎదురుమొండి - గొల్లమంద రోడ్డుకు రూ.13.8 కోట్లతో నిర్మాణ పనులకు టెండర్లు ఖరారైనట్లు వివరించారు. మొంథా తుపానుకు అవనిగడ్డ, కోడూరుల్లో దెబ్బతిన్న పంటలను ఆయన గురువారం పరిశీలించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నియోజకవర్గంలో మొంథా తుఫాన్ నష్టాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషనును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దివి ప్రాంతంలో ఇరిగేషన్ మురుగు కాల్వల్లో పూడికతీత పనులు సక్రమంగా చేపట్టడంతో తుపాను నష్టం తక్కువగా ఉందన్నారు. సముద్రపు నీరు పొలాల మీదకు రాకుండా పాడైపోయిన పాత వంతెన స్థానంలో కొత్త అవుట్ ఫాల్ సూయిజ్ వంతెన నిర్మిస్తామన్నారు. ఇందుకోసం నాబార్డ్ ఇతర నిధులు సమీకరిస్తామన్నారు. లోతట్టు ప్రాంతాలకు చెందిన 23,744 మందిని 240 సహాయక శిబిరాలకు తరలించినట్లు చెప్పారు. కృష్ణాజిల్లాలో ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు 46,357 హెక్టార్లలో వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. దీనివల్ల 56వేల మందికిపైగా రైతులపై ప్రభావం చూపిందన్నారు. అలాగే 1,416 హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతినడంతో 2,229 మంది రైతులు నష్టపోయారన్నారు. బాధితుల్లో ఎక్కువ మంది (మిగతా 2లో)

తుపాను బాధిత రైతులను ఆదుకోవాలి

- సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట, వత్సవాయి

మొంథా తుపానుతో దెబ్బతిన్న రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ డిమాండ్ చేశారు. జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్ పేటలో తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వరి, పత్తి పంటలను, వత్సవాయి మండలం లింగాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని, లింగాల కాజ్‌వే వద్ద మునేరు వరద ఉధృతిని గురువారం సిపిఎం నేతలు పరిశీలించారు. ఈసందర్భంగా డి.వి.కృష్ణ మాట్లాడుతూ తుపాను కారణంగా పంటలు, రోడ్లు, ఇళ్లు, పలు పాఠశాలలు దెబ్బతిన్నాయని చెప్పారు. రైతాంగం లక్షల్లో పెట్టుబడి పెట్టి నష్టపోయారన్నారు. కౌలు రైతులు ముందుగా కౌలు (మిగతా 2లో)



షేర్‌మహ్మద్‌పేటలో పంట పొలాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

వసతి గృహం... సమస్యలు అనేకం

- అధ్వానంగా మరుగుదొడ్లు
- ప్రమాదకరంగా శ్లాబు

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. రెడ్డిగూడెం మండల కేంద్రంలోని బిసి బాలుర



వసతి గృహంలో ఎంతో కాలంగా సమస్యలు తిష్టవేశాయి. గతంలో ఈ వసతి గృహం విద్యార్థులతో కళకళలాడుతూ ఉండేది. ఇప్పుడు సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఈ వసతి గృహాన్ని నడిపించడంలో అధికారులు ఆసక్తి చూపడం లేదు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు చొరవ చూపడం లేదనే విమర్శలున్నాయి. ఇక్కడ పూర్తి స్థాయిలో వార్డెన్ నియామకం లేకపోవడంతో వంట మనిషే పర్యవేక్షణ బాధ్యతలు చూస్తుండటంతో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం ఈ వసతి గృహంలో 32 మంది విద్యార్థులు ఉన్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయి. నీటి వసతి లేకపోవడంతో వసతి గృహానికి (మిగతా 2లో)



అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

పరిహారానికి కూటమి మెలిక

బాధిత రైతుల నుండి ధాన్యం సేకరించబోమంటున్న అధికారులు

ప్రజాశక్తి-కృష్ణా ప్రతినిధి

పిల్లికి చెలగాటం... ఎలుకకు ప్రాణ సంకటం అన్న చందంగా ఉంది మొంథా తుపాను బాధిత రైతుల పరిస్థితి. తుపానుకు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ప్రకటిస్తున్న కూటమి నేతలు ధాన్యం సేకరణకు, తుపానుకు దెబ్బతిన్న వరి పంటకు ఇచ్చే పరిహారానికి మెలిక పెడుతున్నారు. ఇది బాధిత రైతులకు సంకటంగా మారింది. పరిహారం చెల్లించిన భూముల్లో పండిన ధాన్యాన్ని సేకరించబోమని, రెండిట్లో ఏదో ఒకదాన్ని మాత్రమే రైతులు ఎంచుకోవాలని అధికారులు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పరిహారానికీ, ధాన్యం సేకరణకూ మెలిక పెట్టడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. తుపానుకు (మిగతా 2లో)



గుడ్లవల్లేరులో దెబ్బతిన్న వరి

మొదటిపేజీ తరువాయి

వరద భయం

నిలిచిపోయే అవకాశం ఉంది. ఇప్పటికే కంచికచర్ల, వీరులపాడు, నందిగామ, పెనుగంచిప్రోలు మండలాల పరిధిలో మున్నేరు తీర ప్రాంతంలో పంటలన్నీ నీటమునిగాయి. కృష్ణా నదికి ఎగువ నుండి 5 లక్షల క్యూసెక్కుల వరదతో పాటు మునేరు నుండి మరో 1.36 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరుతుంది. దీంతో కృష్ణానది లంకలో నివాసం ఉంటున్న 15 కుటుంబాలను గురువారం అధికారులు గని ఆత్కూరుకు తరలించారు. గండేపల్లి, పెండ్యాల, వేములపల్లి తీర గ్రామాల పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించారు.

వరద ప్రవాహాన్ని పరిశీలించిన మంత్రి సత్యకుమార్

కంచికచర్ల మండలం కీసర బ్రిడ్జి వద్ద మున్నేరు వరద ప్రవాహాన్ని ఎన్‌టిఆర్ జిల్లా ఇన్చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం పరిశీలించారు. వరద ఉధృతి, తీర గ్రామాల పరిస్థితి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. భారీ వర్షాలకు ఖమ్మం, వరంగల్ ప్రాంతాల నుండి మున్నేరుకు అనూహ్యంగా వరద పెరిగి పెనుగంచిప్రోలు, వత్సవాయి, నందిగామ, కంచికచర్ల మండలాల్లో తీర గ్రామాలను ముంచెత్తుతుందని అన్నారు. ప్రజలను కాపాడేందుకు జిల్లా అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, వసంత కృష్ణప్రసాద్, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు, నందిగామ ఆర్డీఓ బాలకృష్ణ, ఏసిపి తిలక్, సిఐ చవాన్, ఏఎంసీ ఛైర్మెన్ కోగంటి బాబు, తహశీల్దార్ నరశింహారావు తదితరులు పాల్గొన్నారు.

బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ 69 గేట్లను పూర్తిస్థాయిలో పైకి ఎత్తి నీటిని సముద్రంలో విడుదల చేస్తున్నారు. బ్యారేజీ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 12 అడుగులు కాగా ప్రస్తుతం 15.2 అడుగుల వద్ద వరద ప్రవాహం కొనసాగుతుంది. బ్యారేజీ వద్ద వరద పరిస్థితిని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు.

పరిహారానికి కూటమి మెలిక

కృష్ణాజిల్లాలో 45041 హెక్టార్లలో వరి పైరు దెబ్బతిందని వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా. 33 శాతానికిపైగా నష్టపోయిన పంటలకు మాత్రమే ప్రభుత్వం పరిహారం అందిస్తుంది. తాజాగా పరిహారం చెల్లింపునకు రైతుల వివరాలను క్షేత్రస్థాయిలో నమోదు చేసుకుంటున్నారు. నేలవాలిన వరికి ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తారు. తాజాగా పరిహారం చెల్లించిన పంటకు సంబంధించిన ధాన్యం దిగుబడిని రైతుల నుండి కొనుగోలు చేయబోమని అధికారులు చెబుతున్నారు. సాధారణ పరిస్థితిలో ఎకరాకు 33 బస్తాలు (75 కిలోల బస్తా) దిగుబడి వస్తుంది. 75 కిలోల ఏ గ్రేడ్ ధాన్యానికి ప్రభుత్వం రూ.1791.75 చెల్లించి రైతుల నుండి సేకరిస్తుంది. ఎకరాకు రైతుకు రూ.59,127.75 వస్తుంది. ఖర్చులు రూ.40 వేలు పోను సొంత భూమి ఉన్న రైతుకు సగటున రూ.19 వేలు మిగులుతుంది. తుపానుకు దెబ్బతిన్న వరి పొలాల్లో దిగుబడులు ఎకరాకు 12 నుండి 20 బస్తాలు మాత్రమే వస్తాయి. ఈ నేపథ్యంలో ఎకరాకు రూ.21,501 నుండి రూ.35,835 మాత్రమే ఆదాయం వస్తుంది. నేలవాలిన వరి నుండి వచ్చే ధాన్యం ఉత్పత్తుల నాణ్యత తగ్గుతుంది. ఈ క్రమంలో రైతులకు పరిహారం ఇవ్వడంతోపాటు తడిచి రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి. అప్పుడే రైతుకు ఒకింత ఊరట కలుగుతుంది. అయితే అధికారులు పరిహారంతో మెలిక పెడుతున్నారు. ప్రభుత్వం ధాన్యం సేకరించకపోతే బహిరంగ మార్కెట్లో కనీస మద్దతు ధర దక్కని పరిస్థితి ఉంది. మిల్లర్లు, వ్యాపారులు అడిగిన ధరకు ధాన్యం అమ్ముకోవాల్సి ఉంటుంది. నేలవాలిన వరి ధాన్యం నాణ్యత లేదని సాకులు చూపి బస్తాకు రూ.800 నుండి రూ.1000 వరకు కోత పెట్టిన పరిస్థితి గతంలో ఎదురైంది. తాజాగా తుపానుకు దెబ్బతిన్న వరి పొలాల్లో ఎకరాకు కనిష్టంగా 12 బస్తాలు, గరిష్ఠంగా 22 బస్తాలు దిగుబడి వస్తుంది. 33 శాతాన్ని పరిగణలోకి తీసుకునిఇ పరిహారం ఇచ్చామనే పేరుతో ఈ మొత్తం ధాన్యం సేకరించకపోతే తమకు కనీస ఊరట కూడా దక్కదని తుపాను బాధిత రైతులు వాపోతున్నారు.

వసతి గృహం... సమస్యలు అనేకం

చెందిన మోటర్ పైప్ ద్వారా బహిరంగ ప్రదేశాల్లో విద్యార్థులు స్నానం చేస్తున్నారు. విద్యుత్ స్విచ్ బోర్డులు ప్రమాదకరంగా తయారయ్యాయి. వైర్లు బయటకు వేలాడుతూ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వసతి గృహం స్లాబు పెచ్చులూడి దర్శనమిస్తుంది. కొన్ని గదులకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో చీకట్లో ఉంటున్నాయి. వరండాలో రేకులు పగిలిపోవడంతో వర్షం పడితే అంతా బురదమయంగా మారుతుంది. వర్షం పడితే హాస్టల్ చూట్టూ నీరు చేరుతుంది. దీనికి తోడు నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రివేళల్లో భయానక పరిస్థితి ఏర్పడుతుంది. అధికారులు స్పందించి వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలని, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఎగువ నుండి వస్తున్న వరద నీటిలో కొట్టుకొస్తున్న బోట్‌ను గమనించిన స్థానిక జాలర్లు, ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమవ్వడంతో పెను ప్రమాదం తప్పింది. గతంలో వరదల సమయంలో ఇలాగే పడవలు ప్రకాశం బ్యారేజి గేటును ఢీకొన్నాయి. ప్రస్తుతం తుమ్మలపాలెంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సహకారంతో కృష్ణానది ఒడ్డున నిలిపారు.

తుపాను బాధిత రైతులను ఆదుకోవాలి

కట్టి దిక్కుతోచని ఎదుర్కొంటున్నారని చెప్పారు. దెబ్బతిన్న పత్తిపంటకు ఎకరానికి రూ.25 వేలు, వరికి రూ.25 వేలు, మొక్కజొన్న, ఇతర పంటలకు జరిగిన నష్టం ఆధారంగా నష్టాన్ని త్వరగా అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలన్నారు. దెబ్బతిన్న పంటల వివరాలను తమ పార్టీ ప్రభుత్వం దష్టికి తీసుకొచ్చిందన్నారు. బాధితులను ఆదుకోవడంపై ప్రభుత్వం వేగంగా స్పందించాలని కోరారు. తెలంగాణా కురిసిన భారీ వర్షాల కారణంగా మునేరు వాగుకు సామర్థ్యానికి మించి నాలుగు రెట్లకుపైగా అదనంగా రావడంతో రోడ్లు, వంతెనాలు దెబ్బతిన్నాయన్నారు. గత రెండు రోజులుగా లింగాల బ్రిడ్జి పైనుండి రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మునేరు ఉధృతి మరింత పెరిగి పెనుగంచిప్రోలు వంతెనపై కూడా నీరు ప్రవహించటంతో రాకపోకలను నియంత్రించాల్సి వచ్చిందన్నారు. వర్షాల వలన రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, రోజూవారి కార్మికులు ఉపాధి కోల్పోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దెబ్బతిన్న పంటలను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లింగాల వద్ద మునేరుపై, గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరుపై హై లెవెల్ బ్రిడ్జిలు నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వాలకు పట్టడంలేదన్నారు. పోలంపల్లి ప్రాజెక్టును పూర్తి చేయాలని, దెబ్బతిన్న అంతర్గత రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కంకర క్వారీల్లో పనిచేసే కార్మికులకు మూడు నాలుగు రోజులుగా పనులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వారికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్, జగ్గయ్యపేట మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి, చిరుమామిళ్ల హనుమంతరావు, నాయకులు కోటా కష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, కాకనబోయిన వెంకటేశ్వరరావు, దంతాల రాజేశ్వరి, దంతాల నరేంద్ర, రావెళ్ల శేఘ, డి.భాస్కర్, షేక్ బడే మియా, గంగుల వెంకటేశ్వర్లు, ఏసుపోగు.వెంకటరత్నం, లింగాల గ్రామ పెద్దలు తొండెపు జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ నష్టంపై వ్యక్తిగతంగా సమీక్ష

కౌలు రైతులు ఉన్నారని చెప్పారు. వారికి తగిన న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మిగిలిన పంట నష్ట అంచనా ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. 39 ఇళ్లు పూర్తిగా, 489 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని చెప్పారు. వీటన్నిటికీ కూడా ప్రభుత్వం తరఫున తప్పకుండా సాయం అందించి ఆదుకుంటామన్నారు. పొట్టకూటి కోసం మేకలు తోలుకుని లంకకు వెళ్లి తుపానులో చిక్కుకున్న నలుగురిని రెస్క్యూ బందాలు కాపాడినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివద్ధికి, మొంథా తుపాను నష్టం తీర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ పర్యటనలో మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర, ఎంపి వల్లభనేని బాలశౌరి, ఆర్‌టిసి ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎంఎల్‌ఎ మండలి బుద్ధప్రసాద్, ప్రత్యేకాధికారి కాటా ఆమ్రపాలి, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు, జెసి ఎం.నవీన్, డిప్యూటీ కలెక్టర్ ఫర్వీన్ జాహిద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

వరికి తీవ్ర నష్టం



తుపానుకు నేలకొరిగిన వరిపంట

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మొంథా తుపానుతో పంటలు దెబ్బతిని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడ్లవల్లేరు మండలంలో 2,255 కరాల్లో నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారులు ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. కాని ఇంకా వేలాది ఎకరాల్లో పంట నేల వాలింది. పొట్ట దశలో ఉన్న ఈ పంట ఒకసారి వర్షానికి నేలకు వాలితే ఇక పంట పండే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వాతావరణం తెరిపిచ్చాక నేల వాలిన పంటలోని వరి గింజలన్నీ తప్పలుగా మారిపోయాయి. దీనితో ధాన్యం తూకానికి రాదని రైతులు వాపోతున్నారు. అంతేగాక పాలు పోసుకునే దశలో ఉన్న పంట కాస్తా పండకుండా పోతుందని ఆవేద నకు గురవుతున్నారు.

పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

మోంథా తుపానుకు రైతులు కకావిక లమయ్యారని వైఎస్సార్ సీపీ గుడివాడ నియోజకవర్గ రైతు విభాగ కన్వీనర్ పెన్నేరు ప్రభాకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుపానుకు గుడివాడ నియోజకవర్గంలోని తుఫాను వలన ప్రతి గ్రామములోనూ వరి భూములన్నీ నేలకు అంటుకు పోయాయన్నారు. ఇట్టి పరిస్థితులలో సాగుచేసిన రైతులు, కౌలు రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో వరి పంట దెబ్బ తిన్న భూములను వ్యవసాయ అధికారులతో పరిశీలించి, తగు నష్టపరిహారాన్ని రైతులకు అందేటట్లుగా చూడాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

1న కురుమద్దాలిలో జాబ్‌మేళా : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు నవంబర్ 1వ తేదీ శనివారం పామర్రు మండలం కురుమద్దా లిలోని రూరల్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్(కమ్యూనిటీ హాల్)లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ తెలిపారు. ఈ జాబ్ మేళాలో, జపనీస్ ఎం ఎన్ సి బి ఎన్ ఎస్ ఇన్స్టుమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అమెరికన్ ఎం ఎన్ సి - కోల్గేట్ పల్మోలివ్ లిమిటెడ్, ఫాక్స్కాన్ ఎం ఎన్ సి, టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, పి వి ఎస్ లాబొరేటరీస్ లిమిటెడ్, సంతోష్ ఆటోమోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్నోవ్సోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసి, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, వరుణ్ గ్రూప్, శ్రీనివాస ట్రాక్టర్స్(ఎస్కార్ట్స్ లిమి టెడ్)వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని ఉపాధి అధికారి/డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డి.విక్టర్ బాబు జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి డాక్టర్. పి.నరేష్ కుమార్ తెలిపారు. ఈ కంపెనీలలో గల ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.ఫార్మసి పూర్తిచేసిన 18 నుండి 35 సంవత్సరాల లోపు యువత అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 80743 70846, 96767 08041 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.



ఆభరణాలు బహూకరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామివారికి గురువారం దాతల నుంచి వివిధ ఆభరణాల బహూకరణలు వెల్లువెత్తాయి. వల్లభనేని సుబ్బారావు స్మారకార్థం జానకమ్మ కుమారులు మాధవరావు, సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్ (యూఎస్ఏ) రూ.75 వేల విలువైన వెండి చెంబు, రూ.35వేల విలువైన వెండి గొడుగు, మద్రాసు వాస్తవ్యులు అడుసుమిల్లి సుబ్బయ్య కుమార్తె కొల్లిపర సుష్మ, నాగేశ్వరరావు దంపతులు ఇత్తడి ఏకాహారతి, వెదురు చువ్వల భూచక్ర గొడుగులు, ముత్తిరెడ్డి శ్రీనివాసరరావు అండ్ బ్రదర్స్ రూ.60వేల విలువైన వెండి పళ్లెం బహూకరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, మాజీ జెడ్పీటీసీ కొసరాజు బాపయ్యచౌదరి, నెప్రూూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, దేవస్థాన ధర్మకర్తలు మురాల నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా సత్యదేవుని మహెూత్సవాలు : సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో గురువారం నుంచి శిఖర ప్రతిష్టా మహెూత్సవాలను కనుల పండువగా నిర్వాహకులు చేపట్టారు. ఆలయాన్ని అద్భుతమైన ఆకర్షణీయ క్షేత్రంగా తీర్చిదిద్దారు.

వరిపొలాల్లో నీటిని తొలగించాలి

ప్రజాశక్తి-గూడూరు : తుపాను కారణంగా నేలవాలిన వరి పైరును రైతులు అవకాశాన్ని బట్టి పైకి లేపి కట్టు కోవాలని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా.కే.నాగేంద్ర రావు, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బందం డా.యం.వెంకట లక్ష్మి, శ్రీ.జే. యశ్వంత్ కుమార్ సూచించారు. గురువారం గూడూరు మండలాల్లో వ్యవసాయశాఖాధి కారులతో కలిసి వారు పంట పొలాలను కంకటావా గ్రామంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంటీయూ 1318, ఎంటీయూ1262, బీపీటీ 5204 వరి రకాలు పూత మరియు పాలుపోసుకునే దశలో ఉన్నాయన్నారు. నిలబడి ఉన్న పొలాల్లో తాలు గింజలు ఏర్పడేందుకు అవకాశం ఉందని, ధాన్యం రంగు మారకుండా, మానిపండు, మాగుడు తెగుళ్ళు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. స్వర్ణ, సంపద స్వర్ణ. వంటి వంగడాలు పాలుపోసు కునే దశలో ఉన్నట్లు గుర్తించామని, ఈ రకాల వరి పడిపోతే పొలంలో నీటిని అంతర్గత కాలు వల ద్వారా తొలగించాలని సూచించారు. నిలబడి, పడిపోయిన పొలాల్లో గింజలు రంగు మారకుండా, తెగుళ్ల వ్యాప్తి నివారణకు ఎకరానికి 200 మి.లీ. చొప్పున ప్రొపికోనజోల్ పిచికారీ చేసుకోవాలన్నారు. నిలిచిన, పడిపోయిన వరి వంటలో కంకిలో మొలకలు కనపడితే పొలాల్లో నీరు బయటకు తీసేసి 5 శాతం ఉప్పు ద్రావణం (50) గ్రాముల కల్లు ఉప్పు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. తద్వారా మొలకెత్త డాన్ని, రంగుమారడాన్ని అరికట్టవచ్చన్నారు.



పంటలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

తమిరిశ-పోలుకొండ రోడ్డు అధ్వానం

ప్రజాశక్తి -నందివాడ : మండలంలోని తమిరిశ నుండి పోలుకొండ వెళ్లే జిపికే రోడ్డు అధ్వానంగా మారింది. అడుగడుగునా గోతులు లేచిన రాళ్లతో ప్రయాణికులకు చుక్కలు చూపిస్తుంది. గుడివాడ నుండి పోలుకొండ గ్రామం వరకు 13 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న రోడ్డును గుడివాడ నుండి తమిరిస వరకు గత ప్రభుత్వ హయాంలో నిర్మించి మిగతా రోడ్డును గాలికి వదిలేసారు. ఫలితంగా రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి రాళ్ల లేచి ప్రయాణాలకు నరకప్రాయంగా మారింది. వర్షాలు వస్తే రోడ్డు చెరువు వల్ల మారి ప్రయాణాలకు దారుణంగా మారింది. ఈ ప్రాంతం లో ఆక్వా పరిశ్రమ విస్తరించడంతో రోజువారి వందల సంఖ్యలో లారీలు చేపల మేత నిమిత్తం నిత్యం ప్రయాణిస్తూ ఉంటాయి. దీనివలన రోడ్డు మరింత దారుణంగా మారింది. రెండు



దశాబ్దాల క్రితం అప్పటి మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు రోడ్డును నిర్మించారు. అప్పటినుండి ఇప్పటివరకు రోడ్డు నిర్మించిన దాఖలాలు లేవు. ప్రతిరోజు పరిసర ప్రాంత గ్రామాలకు చెందిన విద్యార్థులు చదువుల నిమిత్తం గుడివాడ ప్రయాణిస్తూ ఉంటారు. రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో విద్యార్థులు ప్రయాణాలకు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటివరకు రోడ్డు నిర్మాణం గురించి పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టి కష్టాలను తీర్చాలని గ్రామాల ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.

నాసిరకం కూరగాయలు విక్రయంపట్ల అసంతృప్తి

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : గన్నవరంలోని రైతు బజార్లో నాసిరకం కూరగాయలు సరఫరాతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారస్తులు రైతుబజార్లోకి వచ్చిన నాణ్యమైన కూరగాయలను వెంటనే గ్రేడింగ్ చేసి క్యారియర్ పాయింట్లు, హెూటళ్లు, బయట ఉన్న కూరగాయల దుకాణాలకు తరలిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా స్థానిక వినియోగదారులకు నాణ్యత లేని కూరగాయలు మాత్రమే దొరుకుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే, ఇంటి దగ్గరకు వచ్చే వాహన వ్యాపారాల వద్ద, లేదా దగ్గరి దుకాణాల్లో రూపాయి ఎక్కువ ఇచ్చైనా నాణ్యమైన కూరలు కొనుగోలు చేయడమే మంచిదని వినియోగదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే రైతుల వాదన మరోలా ఉంది. ఈ సమస్యకు కారణం బోర్డు ధరల విధానమే అంటున్నారు. వాస్తవానికి విజయవాడ రేటుకు రెండు రూపాయలు ఎక్కువ చొప్పన బోర్డు పెట్టాలని రైతులు వాదిస్తున్నారు. అయితే రైతు బజార్లను పేద ప్రజల కోసం నడపాలని, వ్యాపారస్తుల కోసం కాదని ప్రజలు తమ అసంతప్తిని వ్యక్తం చేస్తున్నారు. బోర్డు రేట్ల కంటే ఎక్కువకు కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారస్తులు తాము మా ఇష్టం వచ్చిన రేటుకే అమ్ముతాము అని బాహాటంగా వినియోగదారులతో వాదనకు దిగుడం, మీకు ఇష్టమైతే కూరలు కొనండి లేదంటే బయటకు పొండి అనే దోరణి కొనసాగుతుంది.



కూరగాయల నాణ్యతపై గొడవపడుతున్న దృశ్యం



నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : మొందా తుఫాన్ తాకిడికి బంటుమిల్లి మండల పరిధిలో దెబ్బతిన్న వరి పంటలను కృష్ణా జిల్లా రైతు సంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు ,బంటుమిల్లి మండలం రైతుసంఘం అధ్యక్ష కార్యదర్శులు, మలిశెట్టి శివరాం ప్రసాద్ ,లంకదాసుల అజయ్ ఘోష్, సిఐటియు నాయకులు మాజేటి శివశ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. అనంతరం బంటుమిల్లి తహశీల్దార్ కాగిన పూర్ణచంద్రకు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో రాంబాబు, యార్లగడ్డ యేసు, కాగిత రాఘవులు, కాగిత స్వామి పాల్గొన్నారు.

నేడు కంకిపాడుకు చంద్రబాబు రాక

ప్రజాశక్తి-కంకిపాడు : ఈ నెల 31వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కంకిపా డులోని ఓ కార్య క్రమంలో పాల్గొనేం దుకు అయాన్ కన్వెన్షన్ సెంటర్‌కు రానున్న నేపథ్యంలో గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వీ. విద్యాసాగర్ నాయుడుతో కలిసి ముందస్తు భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రయాణించే రోడ్డు మార్గంలో రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా బందోబస్తు ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, ఎస్పీ సత్యనారాయణ, ఉయ్యూరు ఆర్డిఓ బిఎస్ హేలా షారోన్, డిపిఓ డాక్టర్ జై అరుణ, డిఎంఅండ్ హెచ్ ఓ డాక్టర్ యుగంధర్, జిల్లా అగ్నిమాపక అధికారి ఏసురత్నం తదితర అధికారులున్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్



పాడైన వరిపంటను పరిశీలిస్తున్న కైలే అనిల్‌కుమార్

పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి : కైలే

ప్రజాశక్తి-పమిడిముక్కల : మొంథా తుఫానులో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. గురువారం పమిడిముక్కల మండలంలోని తాడంకి, లంకపల్లి, కృష్ణాపురం గ్రామాల్లో పర్యటించి వరి పంటలను పరిశీలించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను దాటికి వరి కిందపడి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. గతంలో ఇలాంటి నష్టం జరిగినప్పుడు వైసిపి ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి సాయం చేసిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు యలమంచిలి గణేష్, మండల వైయస్సార్ పార్టీ కార్యదర్శి గరికపూడి బుజ్జి, అగ్నిపర్రు గ్రామ సర్పంచ్ కోట మణిరాజ్, కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, అజీజ్ పాల్గొన్నారు.

పంట నష్టం వివరాలు సేకరించాలి



ప్రజాశక్తి-గంపలగూడెం: మొంథా తుపాను వల్ల దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు మద్దిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు గువ్వల సీతారామరెడ్డి గురువారం అనుముల్లంక, కనుమూరు తదితర గ్రామాలు పర్యటించి, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను సేకరించారు. తుపాను తీవ్రత కొంత తగ్గినప్పటికీ పత్తి పంట అధిక వర్షాలతో తీవ్రంగా దెబ్బతిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టం అంచనాలు తయారు చేసి పరిహారం చెల్లించాలని కోరారు.

గుంతలు పూడ్చాలని వైసిపి నిరసన



ప్రజాశక్తి-జి కొండూరు: మైలవరం నియోజకవర్గంలోని రహదారులపై ఏర్పడిన గుంతలు పూడ్చాలంటూ వైసిపి నాయకులు రోడ్డుపై మొక్కలు నాటుతూ గురువారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగీ రమేష్ పాల్గొని జి కొండూరులోని గేల్ కంపెనీ వద్ద నుండి గద్దమడుగు గ్రామ శివారు వరకు వైసిపి శ్రేణులతో కలిసి పాదయాత్ర చేశారు. నియోజకవర్గంలో ఉన్న గోతులు ఎమ్మెల్యే వసంతకు కనబడడం లేదా? అని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లతో వాటా కుదుర్చుకోవడమేగానీ అభివృద్ధిపై దృష్టి లేదంటూ విమర్శించారు. రోడ్లపై ఏర్పడిన గుంతలు పూర్చుకపోతే భవిష్యత్తులో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జి కొండూరు ఎంపీపీ లక్ష్మీ తిరుపతమ్మ, జడ్పిటిసి మంద జక్రధర్‌రావు, జి కొండూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు జడ రాంబాబు పాల్గొన్నారు

తుపాను బాధితులకు ఎమ్మెల్యే సాయం



ప్రజాశక్తి-గంపలగూడెం: మొంథా తుపాను బాధితులలైన 18 కుటుంబాలకు నిత్యావసర సరుకులు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు గురువారం అందజేశారు. పెద్ద కొమేర గ్రామం తోటమూలలో ఉన్న డేరా బుడగ జంగాలు ఉండటంతో, రెవెన్యూ అధికారులు రిలీఫ్ కేంద్రాలకు పంపించిన విషయం తెలిసిందే. సదరు బాధితులకు బియ్యం, కూరగాయలు, నూనె, తదితర నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వడ్డేశ్వరకు రాజకుమారి, ఆర్ఐ వీరభద్రరావు, తదితరులు ఉన్నారు.

సొల్యూషన్ ఫర్ టుమారో-2025 విజేతల ప్రకటన

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్, తన జాతీయవిద్యా కార్యక్రమం 'శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో 2025' నాల్గవ ఎడిషన్ విజేతలను ప్రకటించినట్లు ప్రోగ్రామ్ ఇంచార్జి కె.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం యువ విద్యార్థులు సాంకేతికతను వినియోగించి తమ స్థానిక కమ్యూనిటీల్లోని వాస్తవ ప్రపంచ సవాళ్లకు సజనాత్మక పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి ప్రోత్సహిస్తుందని తెలిపారు. మొదటి నాలుగు విజేత జట్లు, పెర్సెవియా (బెంగళూరు), నెక్స్ట్ ప్లేఏఐ (ఔరంగాబాద్), పారస్పిక్ (గురుగ్రామ్), పృథ్వీ రక్షక్(పలాము) ఉన్నారని అన్నారు. ఐఐటి ఢిల్లీకి చెందిన ఫిట్ ల్యాబ్స్‌లో మెంటర్‌షిప్ మద్దతుతో, తమ ఆవిష్కరణాత్మక ప్రోటోటైప్‌లను స్కేలబుల్ రియల్ వరల్డ్ పరిష్కారాలుగా అభివృద్ధి చేయడానికి రూ.కోటి విలువైన ఇంక్యుబేషన్ గ్రాంట్లు అందుకున్నారనీ తెలిపారు.. జ్యూరీ ప్యానెల్‌లో శామ్సంగ్ నాయకత్వం, అలాగే విద్యా సంస్థలు, ప్రభుత్వం, పరిశ్రమల నిపుణులు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్మృతివనం కార్మికులకు వేతనాలు చెల్లించాలి

- కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి



ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతి వనం పారిశుధ్య కార్మికుల తొమ్మిది నెలల పెండింగ్ జీతాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంధ్ర మాల్యాద్రి అన్నారు. కార్మికులకు కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వకపోయినా నగర పాలక సంస్థ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు చేస్తున్న ఆందోళనకు మాల్యాద్రి మద్దతు తెలిపారు. గురువారం స్మృతివనం వద్ద కార్మికులు చేస్తున్న ఆందోళనలో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ 9 నెలలుగా వేతనాలు ఎందుకు ఇవ్వడంలేదో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంబేద్కర్ స్మృతి వనం నిర్వహణలో బాధ్యత రహిత్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులంతా ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు చెందిన వారేనని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్, విఎంసి కమిషనర్ స్పందించి కార్మికులకు వేతనాలు ఇచ్చించే విధంగా చర్యలు తీసుకోవాలని కరారు. ఈకార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.క్రాంతికుమార్. సిఐటియు సెంట్రల్ సిటీ నాయకులు ఎం.బాబురావు, వై.సుబ్బారావు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర సజనాత్మక, సంస్కృతి ముఖ్య కార్యనిర్వహణాధికారి మల్లిఖార్జున్‌ను కలిసి చర్చించారు. ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్‌కు వినతిపత్రం అందజేశారు.

మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా హసీమ్ బేగ్



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా హసీమ్ బేగ్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. సెప్టెంబర్ 3న విడుదలైన నామినేటెడ్ పోస్టులలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా హసీమ్ బేగ్‌ను పదవి దక్కింది. ఈ క్రమంలో విజయవాడలో కార్పొరేషన్ బోర్డు 156వ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో బేగ్ పూర్తి స్థాయిలో తన పదవీ బాధ్యతలు స్వీకరించారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తనకు పదవీ బాధ్యతలు అప్పగించటంలో కృషి చేసిన మంత్రి కొల్లు రవీంద్ర, బందరు ఎంపి వల్లభనేని బాలసౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ సాహెబ్ విసి, ఎండి యాకూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఉత్తరాది మహిళల ఛర్ పూజ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దేశ ప్రజలు సుభిక్షంగా, సుఖ:సంతోషాలతో ఉండాలని సూర్యభగవానికి పూజలు నిర్వహిస్తామని, ప్రకృతి, పర్యావరణ పరిరక్షణకు ఛర్ పూజలు నిర్వహించడం అనందంగా ఉందని ఉత్తర భారతీయ సేవా సంఘం అద్యక్షులు భావేష్ పాఠక్, ఉపాధ్యక్షుడు పంచానంద్‌సా తెలిపారు. గురువారం స్థానిక భవాని ఘాట్‌లో ఉత్తరభారతీయ సేవా సమితి అద్వర్యంలో బీహారీలు, డిల్లీ, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాలకు సంబంధించిన సుమారు ఐదు వందల మందికిపైగా హాజరై ప్రత్యేక స్నానాలు అచరించి, కృష్ణమ్మ వడిలో ఛర్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరభారతీయ సేవా సమితి అద్యక్షుడు భావేష్ పాఠక్ మాట్లాడుతూ దీపావళి తరువాత సూర్యభగవానుడికి ఛర్ పూజ చేయడం అనావాయితి అని,పూజలు చేసేందుకు ఉపావాసదీక్షలతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రంమలో సెక్రటరీ ఉదయ్ సా,సచ్చివ్ నివేష్ కుమార్, రాంబందన్ నిషాద్, రవిశంకర్ పండిట్, మనిష్ కుమార్,రాహుల్ కుమార్,మనిష్ కుమార్,పియాన్సు రాజ్,కన్నయ్య కుమార్, గిరిజేష్ కుమార్, రేఖదేవి, మున్నిదేవి తదితరులు పాల్గోన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల పరిశీలన



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఎగువన కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కృష్ణా నదికి భారీగా వరద ప్రవాహం పెరిగింది. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ఇబ్రహీం పట్నం పవిత్ర సంగమం, ఫెర్రీ ఘాట్, చిలుకూరు గ్రామాల్లో కష్ణా నది వరద ప్రవాహాన్ని గురువారం ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలిక్కియ, ఆర్ డి ఓ కావురి చైతన్య, వెస్ట్ జోన్ ఏ సి పి దుర్గారావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సి ఐ చంద్రశేఖర్ తదితరులు ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా వరదనీరు భారీగా వస్తున్నందున కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మొంథా బాధితులకు సిపిఎం అల్పాహారం



ప్రజాశక్తి-విజయవాడ : సిపిఎం నిర్వహిస్తున్న తుపాను బాధితుల పునరావాస కేంద్రాల్లో గురువారం అల్పాహార పంపిణీ చేశారు. క్రీస్తురాజుపురం, మొగల్రాజుపురం, సింగ్‌నగర్ కృష్ణ హెూటల్ సెంటర్‌లో గురువారం కార్మికులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు స్వయంగా పలువురు కార్మికులకు అల్పాహారం వడ్డించారు. మూడు రోజులుగా కార్మికులు పడిన ఇబ్బందులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ... మొంథా తుఫాను బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని విమర్శించారు.

సిపిఎం వంతుగా తుపాను పునరావాస కేంద్రాలు విజయవాడ నగరంలో ఏర్పాటు చేశామని అన్నారు. పని ప్రదేశాల్లో కార్మికులు, వలస కార్మికులు, పేద ప్రజలకు కొంతమేరకైనా ఉపశమనం కలిగించే చర్యలను సిపిఎం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమాలలో సిపిఎం సెంట్రల్, తూర్పు నగర కార్యదర్శు బి రమణారావు, పి కృష్ణ, నాయకులు కె దుర్గారావు, జి.క్రాంతి కుమార్, పిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి అనిల్, నగర నాయకులు స్టాలిన్, మురహరి, దావులూరి శ్రీనివాసరావు, ఎస్‌కె పీర్ సాహెబ్, డి.స్టీఫెన్ బాబు, ఎం నాగార్జున, టి శ్రీను, పి ఎస్ ఎన్ మూర్తి, లింగరాజు, వెంకటేశ్వరరావు, చిన్న మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చింతకాయల బాబురావు మృతికి సిపిఎం, సిఐటియు సంతాపం

విజయవాడ : సిపిఎం పూర్వ రాష్ట్ర కమిటీ సభ్యులు, సిఐటియు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి చింతకాయల బాబూరావు మృతి పట్ల సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. దీర్ఘకాలంపాటు కార్మిక, ప్రజా నాయకునిగా అనేక ఉద్యమాలు నడిపారని గర్తుచేసుకున్నారు. చింతకాయల బాబురావు మృతి ప్రజా, కార్మికోద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందాలి



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ ఆధ్వర్యంలో డిఎవి పాఠశాలలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమాన్ని అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ పి.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాయితీ, సమగ్రత వంటి నైతిక విలువలను విద్యార్థులలో పెంపొందించడానికి ఈ కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. విద్యార్థులకు అవినీతి దుష్ప్రభావాల గురించి తెలియజేసేందుకు ప్రత్యేక ప్రచారాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అవగాహనపై విద్యార్థులకు డిబేట్, క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో విజిలెన్స్ అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సెక్రటరీ పి.శ్రీదేవి, డి.ఎ.వి పాఠశాల ప్రిన్సిపాల్ డి. మన్ మోహన్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వరి రైతులకు ఎకరాకు రూ.20వేల పరిహారం ఇవ్వాలి

- కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు

ప్రజాశక్తి-ఉయ్యూరు : మొంథా తుపాను వల్ల నష్టపోయిన వరి రైతులకు ఎకరాకు రూ.20వేల పరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. పెదఓగిరాల, ఆకునూరు, కాటూరు, కడవకొల్లు, గండిగుంట గ్రామాల్లో గురువారం కౌలురైతు సంఘం నాయకులతో కలసి పర్యటించి తుపానుకు దెబ్బతిన్న వరి, అరటి పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 70 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేశారని అందులో 39లక్షల ఎకరా ల్లో వరిసాగు చేయగా 20లక్షల ఎకరాల్లో వరి తుపానుకు నేలవాలి నష్టం కలిగిందన్నది అంచనా అన్నారు. పంట నేలవాలడం వల్ల పంట కోతఖర్చుకూడా పెరుగుతుందని, ఎకరాకు 15 బస్తాల వరకుదిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నా రన్నారు. ఈపరిస్థితుల్లో తణమో పణమో కాకుండా రూ.20వేలు తక్కువ కాకుండా ఇవ్వాలన్నారు. నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఈ-క్రాప్‌తో సంబంధం లేకుండా రైతులు, కౌలు రైతులనుండి ప్రభుత్వం ప్రకటించిన ధరకు కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోసూరు శివనాగేంద్రం, అన్నే సుబ్బారావు, రాజేశ్,కౌలు రైతులు పాల్గొన్నారు.



ఆకునూరులో నేలకొరిగిన వరిని పరిశీలిస్తున్న ఎంహరిబాబు, ఇతర నాయకులు



మాట్లాడుతున్న రైతులు

అధికారుల తీరు బాధాకరం

- పలువురు రైతులు ఆవేదన

ప్రజాశక్తి-కోడూరు : రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ కోడూరు మండల పర్యటనలో అధికారుల తీరు బాధాకరమని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం కోడూ రులో పాత్రికేయులతో మాట్లాడుతూ కోడూరు మండ లంలో గత ఆరు సంవత్సరాలుగా వేలాది ఎకరాలలో పంట వేసుకోలేని పరిస్థితి, పంట వేసుకున్న ఆ పంట చేతికి రాని పరిస్థితి నెలకొందన్నారు. తీరప్రాంత భూముల సమస్యలు, రైతులు పడుతున్న ఇబ్బందులను అనేకమార్లు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దష్టికి తీసుకువెళ్లాలని ప్రయత్నిం చామన్నారు. ఉపముఖ్యమంత్రి కోడూరు వస్తున్నారని తెలిసి తమబాధలు చెప్పుకోవచ్చుని, తమ సమస్యలు పరిష్కరి స్తారని, కొండంత ఆశతో ఎదురు చూశామన్నారు. కానీ తుఫాన్ విపత్తుకు, సముద్రపు ఆటుపోట్లకు, నష్టపోతున్న కోడూరు మండల దిగువ ప్రాంతానికి, ఉప ముఖ్యమంత్రిని తీసుకురాకుండా, కోడూరు ఎగువ ప్రాంతంలో పంట పొలాలను పరిశీలించేలా అధికారులు సూచించక పోవడం తీవ్ర మనస్థాపం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అద్దంకి పాండురంగారావు పలువూరు రైతులు పాల్గొన్నారు.

పునరావాస బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-మొవ్వ : మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ప్రజలకు ప్రభుత్వం ఇస్తానన్న నిత్యవసరాలు, నగదును ఇవ్వకపోవడంపై సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శీలం నారాయణరావు మండిపడ్డారు. గురువారం ఆయన మాట్లాడుతూ మొవ్వ మండలంలో పునరావాస కేంద్రాల్లో ఉన్న పేద లను ఒట్టి చేతులతో ఇంటికి పంపడం సమంజసం కాదన్నారు.

తుపాను ముంపు ప్రాంతాల్లో వ్యకాస నాయకుల పర్యటన

ప్రజాశక్తి-మోపిదేవి : వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మోపిదేవిలో రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి పవన్ కుమార్‌లు గురువారం తుఫాను ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. మోపిదేవి మండలం మెరకనపల్లి పంచాయతీ చిరువోలు దళిత కాలనీ వాసులు తమకు డ్రైనేజీ సౌకర్యం లేక కురిసిన వర్షపు నీరు రోడ్లు మీదనే నిలిచిపోవడం వలన ఇబ్బందులు పడుతున్నామని, మురికి నీరు నిల్వ ఉండిదోమలు పెరిగి జ్వరాలు, అంటురోగాలు వచ్చే ప్రమాదం ఉందని వారికి వివరించారు. అనంతరం ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికుల ఆధ్వర్యంలో సర్పంచ్‌కు అర్జీ అందించారు. స్పందించిన సర్పంచ్ తన సొంత డబ్బులు ఖర్చుచేసి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సర్పంచికి మెమొరాండం ఇచ్చిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, కార్యదర్శి పవన్ కుమార్, మండల సిఐటియు కార్యదర్శి రాజశేఖర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం మోపిదేవి మండలం వెంకటాపురం కొత్త కాలనీ, చల్లపల్లి మండలం చల్లపల్లి లోని నారాయణరావు నగర్, గురుకుల పాఠశాల కాలనీ, జగనన్న కాలనీలను సందర్శించారు. జగనన్న కాలనీలు లోతట్టు ప్రాంతాలు కావడంతో వర్షపు నీరు నిలిచి ప్రజలు నడవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దడాల సుబ్బారావు అన్నారు. జగన్ ప్రభుత్వంలో ఇచ్చిన కాలనీల పట్ల ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని కాలనీలోని ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు ప్రభుత్వం ఇస్తానన్న నిత్యావసరాలు, నగదు ఇవ్వకపోవడం తగదన్నారు. వ్యవసాయ కూలీలు కూడా పనులు లేక ఇబ్బంది పడుతున్నారనీ, వీరికి 20 వేలు నష్టపరిహారం, 25 కేజీల బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో సిఐటియు చల్లపల్లి మండల కార్యదర్శి కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న దడాల సుబ్బారావు

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం : మంత్రి కొల్లు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : తుఫా నుతో పంట నష్టపోయి ఆందోళనలో ఉన్న ప్రతి రైతును ఆదుకుంటామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. మచిలీపట్నం మండలంలోని భోగిరెడ్డిపల్లె, పెదయాదర, నెలకుర్రు గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను ఆర్టీసీ చైర్మన్ కొనకల నారాయణరావు తో కలిసి పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. అక్కడ ప్రజలతో మాట్లాడి ఆహార నాణ్యత గురించి, సమస్య ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వర్షాలతో గ్రామాల్లో రోడ్లు, విద్యుత్ లైన్లు, డ్రైన్లు దెబ్బతిన్నాయని తెలియజేయడంతో వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా చిన్న సన్నకారు రైతులు నష్టపోకుండా ప్రభుత్వం నుంచి కావాల్సిన మేరకు పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అధికారులు కూడా పంట నష్టం అంచనా విషయంలో ఉదారంగ వ్యవహరించాలని సూచించారు. పరిహారం విషయంలో రైతులకు 90 శాతం వరకు నష్టపరిహారం దక్కేలా చూస్తానన్నారు.




పంటను పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

కృష్ణా వరదతో దివి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమ రైతుల పరిస్థితి తీవ్ర విషాదంగా తయారయింది. కృష్ణానదికి మూడు గపాలుగా వచ్చిన వరదకు మెట్ట భూముల్లోని ఉద్యానవన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దాని నుంచి తేరుకొని తిరిగి సాగుకు సమాయత్తం కాగా, మరోసారి మొంథా తుఫాను రూపంలో పంజా విసిరి, మిగిలి ఉన్న ఉద్యానవన పంటలను తుడిచి పెట్టేసింది. తుఫాన్ వల్ల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు తిరిగి వరదలు ప్రారంభమయ్యాయి. కృష్ణా నదికి ఆరు లక్షల క్యూసెక్కుల వరకు వరద వస్తుందని అధికారులు ప్రకటించడంతో, దివిసీమలోని కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అవనిగడ్డ మండలంలో తుఫానుకు 286 హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. అయితే అదష్టవశాత్తు వరి సాగు చేసుకున్న రైతులకు మాత్రం ఇప్పటివరకు నష్టం జరిగిన దాఖలాలు కనిపించడం లేదు. ముఖ్యంగా అరటి, బొప్పాయి, కంద, పసుపు, కూరగాయల పంటలకు ఎక్కువగా నష్టం వాటిల్లింది. రైతు మీద ప్రకతి పగబట్టినట్లుగా ఉందంటూ రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. రెక్కలుముక్కలు చేసుకొని లక్షలు, వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తుంటే తీరా చేతికొచ్చే సమయానికి విపత్తుల రూపంలో నోటి దగ్గర కొచ్చిన కూటిని తన్నుకుపో యినట్లుగా తుపానులు, వరదలు తన్నుకు పోతున్నాయని రైతులు వాపోతున్నారు. విపత్తులు సంభవించినప్పుడల్లా వ్యవసాయంలో రైతులతో పాటు, కౌలు రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. నష్టపరిహారం వచ్చేవరకు కొంత సొంత భూమి ఉన్న రైతులకు మేలు జరుగుతుంది తప్ప, కౌలు రైతులకు అర-కొర న్యాయమాత్రమే జరుగుతుంది. దీని మీద ప్రభుత్వం అధికారులు దష్టి సారించి తీవ్రంగా నష్టపోతున్న కౌలు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



తుపానుకు దెబ్బతిన్న అరటిపంట



గతంలో వచ్చిన వరదకు కందలో నీళ్లు నిలబడిన దృశ్యం



పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న డిఎంహెచ్‌ఒ యుగంధర్

సమయపాలన పాటించని వైద్యులు

- డిఎంహెచ్‌ఒ ఆగ్రహం

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని వేకనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పి యుగంధర్ గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి సెంటర్‌లో వైద్యులు లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, వైద్యశాల రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వైద్యశాల నిర్వాహణను రికార్డులను పరిశీలించారు.

విద్యుత్ శాఖకు రూ.8.30 లక్షలు నష్టం

ప్రజాశక్తి-పామర్రు : తుఫాను కారణంగా పామర్రు మండల పరిధిలోని పలు గ్రామాల్లో 32 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని పలు విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయని ఈ కారణంగా విద్యుత్ శాఖకు 8.30 లక్షలు నష్టం జరిగినట్లు విద్యుత్ శాఖ ఏడి సుందర్ రావు గురువారం తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ అంత రాయం కలిగిన చోట తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి ప్రజ లకు ఇబ్బందులు లేకుండా చేశా మన్నారు. సమయాను కూలంగా శాశ్వత మరమ్మతులు చేపడతామన్నారు.ఇప్పటివరకు గ్రామా లలోనే నష్టం అంచనా వేశామని, అలాగే వ్యవసాయ నిమిత్తం ఏర్పాటు చేసిన విద్యుత్తు లైన్ల నష్టాన్ని సేకరిస్తామన్నారు. ఈ కార్య క్రమంలో సబ్ ఇంజనీర్ ప్రదీప్, లైన్‌మేన్ కోటేశ్వరావు పాల్గొన్నారు.



'నారాయణ' స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : ఎన్టీఆర్ జిల్లాలో ఇటీవల జరిగిన 6వ జూనియర్ అంతర్ జిల్లాల జంప్ రోప్ పోటీలలో గన్నవరం నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల (విద్యానగర్) విద్యార్థులు ఉత్తమ ప్రదర్శనతో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. 9వ తరగతి విద్యార్థి విక్రమ్ 'స్పీడ్ సింగిల్ బౌన్స్' ఈవెంట్లో బంగారు పతకం, 8వ తరగతి విద్యార్థి నిఖిల్ 'డబుల్ బౌన్స్' ఈవెంట్లో కాంస్య పతకం, భార్గవ్, శ్రీహర్ష, లిఖిత్, యుగంధర్ విద్యార్థులు కాంస్య పతకం సాధించారనిపాఠశాల ప్రిన్సిపాల్ షేక్ మస్తాన్ తెలిపారు. విక్రమ్ మరియు లిఖిత్ రీవా (మధ్యప్రదేశ్)లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఏ జీ ఎం సత్తిరెడ్డి, డీన్ నవీన, పి.ఈ.టి ఖమర్ లు అభినందించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-కంకిపాడు : రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పి-4 పథకంలో భాగంగా తాడిగడప-1 సచివాలయంలో ప్రత్యేక సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్గదర్శి సాగి కృష్ణంరాజు లబ్ధిదారులైన చిట్టెమ్మ, సామ్రాజ్యం, మాలిని, రమణమ్మ, శకుంతల శ్రీనివాస్‌ల బంగారు కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎస్ కే నజీర్, అసిస్టెంట్ కమిషనర్ డి కిరణ్ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రశాంత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు

ప్రజాశక్తి-కంచికర్ల

తుపాన్ వల్ల దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి.ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుపాన్ ప్రభావంతో నేలకొరిగిన వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలను గురువారం రైతు సంఘం నాయకులతో కలిసి మండలంలోని పుల్లూరు, చంద్రగూడెం, కొత్తగూడెం, జి కొండూరు మండలంలో పరిశీలించారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ తుపాను ప్రభావం వల్ల చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. వరి ఎకరాకు రూ 50 వేలు, పత్తికి రూ.30 వేలు, మినుము తదితర పంటలకు ఎకరానికి రూ.20 వేల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం కింద ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను రద్దు చేసి రైతాంగాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు మరలా కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు రావుల సుబ్బారావు, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, రైతు సంఘం నాయకులు సిహెచ్.సుబ్బారెడ్డి, వజ్రాల శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు సర్వీస్ రిజిస్టర్లు అందజేత

ప్రజాశక్తి-విస్సన్నపేట : విస్సన్నపేట మండలంలో కొత్తగా వచ్చిన 20 మంది ఉపాధ్యాయులకు యుటిఎఫ్ సహకారంతో సర్వీస్ రిజిస్టర్లు గురువారం అందజేశారు. యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి బిసిహెచ్‌వి సూర్యనారాయణ మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులు చురుకుగా పనిచేసి విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.చంటిబాబు, ఏ మురళీకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి. రామకృష్ణారెడ్డి, కె.రంగ పాల్గొన్నారు.

అత్యాచార బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-చందర్లపాడు: మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో ఇటీవల అత్యాచారం జరిగిన బాలిక కుటుంబాన్ని ఎన్‌టిఆర్ జిల్లా ఐద్వా నాయకురాలు సరోజ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు రక్షణ కల్పించడంలో రక్షణ కల్పించడంలో విఫలమైందన్నారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం పెంచుకొని బాలిక పట్ల దారుణంగా ప్రవర్తించిన వ్యక్తులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండి న్యాయం చేయాలని, ఆర్థికంగా ఆదుకోవాలని, బాధితురాలికి ఉపాధి కల్పించాలని డిమాండ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు బి గోపి నాయక్, ఎస్.కె హుస్సేన్, అరిగెల చిన్న శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు



నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

విజయవాడ : నవజీవన్ బాల భవన్, డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పాయికాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నవజీవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో జనరల్ వైద్యులు, నేత్రాలు, పళ్ళ, ఎముకలు, కీళ్ళ వైద్యులు పాల్గొంటారని తెలిపారు. జ్వరాలు, దగ్గు, జలుబు, చర్మ వ్యాధులు, ఎముకలు, కాళ్ల నొప్పులు, కీళ్ళు వ్యాధులు, కంటికి సంబంధించిన వైద్యం, పళ్ళ సమస్యలు, ప్రత్యేకించి చిన్నపిల్లలకు సంబంధించిన సమస్యలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో బిపి, షుగర్, గుండెకు సంబంధించిన ఈసిజీ పరీక్షలు ఉచితంగా చేసి, మందులు అందిస్తామని తెలిపారు. ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-వత్సవాయి : ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కూటమి నాయకులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తెలిపారు. గురువారం వత్సవాయిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తుపాను, వరదల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకూడదని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్యకు సూచించారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ జిల్లే పల్లి సుదీర్ బాబు, ప్రెస్ క్లబ్ కన్వీనర్ బోళ్ల రవికుమార్, చుంచు రమేష్ బాబు, జనసేన అధ్యక్షులు తునికిపాటి శివ ఉన్నారు.



జగనన్న కాలనీలో వసతులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: కొండపల్లి ఈలప్రోలు రోడ్డులోని జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి మహేష్, కాలనీ వాసులు రాయుడు లక్ష్మీదేవి, ఎన్ రామకృష్ణ, నాగయ్య, శివ దుర్గా, సూర్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌డిఓ కావూరి చైతన్యకుమార్, తహశీల్దార్ వెంకటేశ్వర్లకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. జగనన్న కాలనీ వాసులకు రోడ్డు, తాగునీరు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు కొండపల్లి మున్సిపాలిటీలో అనుసంధానం చేయాలని కోరారు.



పంట నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-ఎ.కొండూరు : తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఎ.కొండూరు మండలంలోని కంభంపాడు, కృష్ణారావు పాలెం, చీమలపాడు గ్రామాలలో గురువారం మొంథా తుపాను కారణంగా దెబ్బ తిన్న పత్తి, మిర్చి, మినుము, వరి పొలాలను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పెంచిన పంట చేతికొచ్చే దశలో తుపాను రావడంతో తీవ్ర నష్టం వాటిల్లి దిక్కు తోచని పరిస్థితిలో రైతులు ఉన్నారని, నష్టపరిహారం వరి పంటకు హెక్టారుకు రూ.30 వేలు, మినుము ఎకరానికి రూ.15 వేలు, పత్తి హెక్టార్‌కు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో కౌలు రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు జెట్టి వెంకటేశ్వరావు, ఎ.కొండూరు మండల రైతు సంఘం కార్యదర్శి రావుల రామకృష్ణ, అధ్యక్షుడు సోమా మోహన్ రావు (యోహాను), రైతు సంఘం జిల్లా నాయకులు ఆళ్ల అమ్మిరెడ్డి, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు పి.ఆనందరావు, రైతులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విధానాలతోనే సంక్షోభంలో వ్యవసాయం

ప్రజాశక్తి - తిరువూరు : ప్రభుత్వ విధానాలతో వ్యవసాయ రంగంలో సంక్షోభం తలెత్తిందని రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు మద్దిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఎపి రైతు సంఘం తిరువూరు మండల ఏడో మహాసభ భగత్‌సింగ్ కాలనీలోని భగత్ సింగ్ భవనంలో ఎస్.సురేష్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా మద్దిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న రైతు వ్యతిరేక విధానాల ఫలితంగా వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. సబ్సిడీ యూరియాను తగ్గించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా కొరత సృష్టించాయని ఆరోపించారు. మొంథా తుపాన్ ప్రభావంతో పంట నష్టం బాగా జరిగిందని, వ్యవసాయ శాఖ అధికారులతో పంట నష్టం సర్వే చేయించి రైతులకు పరిహారం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సంఘం మండల కమిటీని 12 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా చప్పిడి సురేష్, కార్యదర్శిగా సాంబారు వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. తుఫాన్ నష్ట పరి హారం అందించాలని, అన్ని పంటలకు గిట్టుబా టు ధరలు కల్పించాలని, ఎఫ్ సిఐ ద్వారా పంట లను కొనుగోలు చేయాలని, కోతులను నివారిం చి పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాం డ్ చేస్తూ చేసిన తీర్మానాలన మహాసభ ఆమో దించింది.



రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని గౌరవరం గ్రామంలో తుపాను వల్ల దెబ్బతిన్న ప్రత్తి, మిర్చి పంటలను శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ గురువారం పరిశీలించారు. పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.



నిత్యావసర సరుకులు అందజేత

ప్రజాశక్తి-మైలవరం : మొంథా ప్రభావంతో పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు మైలవరం పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర సరుకులను ఎంపీడీవో అనురాధ, తహశీల్దార్ అబ్దుల్ దరియాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుపాన్ బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టు మస్తాన్‌కు చేయూత

ప్రజాశక్తి- నందిగామ : జర్నలిస్టు మస్తాన్‌కు జర్నలిస్టు సంఘం నాయకులు చేయూత నందించారు. నందిగామకు చెందిన జర్నలిస్ట్ మస్తాన్ గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. ప్రస్తుతం ఆయన కొంత అస్వస్థతకు గురికావడంతో జర్నలిస్టు సంఘం నాయకులు పి.మీరాహుస్సేన్ ఖాన్, నాయకులు అకుల వెంకటనారాయణ, పఠాన్ సైదాఖాన్, జర్నలిస్టులు హామీద్, అన్నవరపు చంద్రశేఖర్ తదితరులు గురువారం నందిగామలోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. జర్నలిస్టు సంఘం తరుపున రూ.5 వేల నగదు, 25 కేజీల బియ్యం, పండ్లను అందజేశారు. న్యూ ఇండియన్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పి.మీరాహుస్సేన్ ఖాన్ మాట్లాడుతూ మస్తాన్ త్వరగా కోలుకొవాలని అకాంక్షించారు.



బియ్యం పంపిణీ

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ ప్రముఖులు పారేపల్లి సాయిబాబు ఆధ్వర్యంలో గురువారం నందిగామ శివారు ఉమా కాలనీ ప్రక్కన గుంట క్వారీ రోడ్డులో నివసిస్తున్న నిరుపేదలైన 21 కుటుంబాలకు ఒక్కొక్కరికి 10 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. నవాబుపేట గ్రామానికి చెందిన పోలిశెట్టి సుధాకర్ పేరిట ఆయన భార్య పద్మావతి, కుమారులు పోలిశెట్టి వెంకటరావు, పోలిశెట్టి ఉపేంద్ర,పోలిశెట్టి సురేష్ సహకారంతో బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పబ్బతి జనార్ధనరావు, వెంకటరెడ్డి, ఏడుకొండలు, బలుసుపాటి నాగరాజు, మనోజ్ భోజనం బండి డ్రైవర్ శివాజీ పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగంపై నిరసన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని ముక్తేశ్వరపురం గ్రామ పంచాయతీలో ప్రజా ధనం దుర్వినియోగం చేసిన సర్పంచ్, కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపిడివో కార్యాలయం వద్ద ముక్తేశ్వరపురం గ్రామానికి చెందిన యువకులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ.. ముక్తేశ్వరపురం పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని స్థానిక యువకులు జులై 14న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ఆగస్టు 13న విచారణ చేపట్టారన్నారు. నిధులు దుర్వినియోగంపై 30 రోజుల్లో ఫిర్యాదుదారులకు నివేదిక ఇస్తామని జగ్గయ్యపేట ఉప మండల పరిషత్ అధికారి పద్మావతి తెలిపారన్నారు. ఇప్పటికి 80 రోజులు అవుతున్నా తుది నివేదిక ఇవ్వకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. త్వరగా నివేదిక ఇచ్చి ప్రజా ధనం దుర్వినియోగం చేసిన సర్పంచ్, కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోట్ల రూపాయలను దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకునే వరకు తమ ఉద్యమం ఆగదని, సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యను తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పిట్టల కృష్ణయ్య, షేక్ అల్లభక్షు, షేక్ దస్తగిరి, పిల్లుట్ల సోములు, షేక్ అక్బర్, షేక్ లాలూ, షేక్ షఫీ, పిట్టల ఉమా శంకర్, షేక్ షకీల్, షేక్ బిలాల్, షేక్.లాల్, మాదవ్, రామిశెట్టి అనిల్ పాల్గొన్నారు.



పంటల సస్యరక్షణకు చర్యలు

ప్రజాశక్తి-గంపలగూడెం : మొంథా ప్రభావిత ప్రాంతాలను వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ అధికారులు గంపలగూడెం మండలంలో గురువారం పర్యటించారు. తునికిపాడు, దుందిరాలపాడు గ్రామాల్లో పర్యటించి, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల సస్యరక్షణ చర్యల్లో భాగంగా వరదల వల్ల పంటలకు ఎండాకు తెగులు, మానిపండు తెగులు, మామిడి తెగులు, ఆకుముడత, దోమపోటు, పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. పొలాల్లో నిలవ ఉన్న నీటిని అంతర్గత కాలువల ద్వారా బయటకు పంపాలని సూచించారు. గింజలు రంగు మారడం, మామిడి తెగులు, మాను పండు తెగులు వ్యాప్తి నివారించడానికి ఎకరాకు 200 మిల్లీలీటర్ల ప్రొసికోనో జోల్ పిచికారి చేయాలన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-మొవ్వ : మొంథా తుఫాను గ్రామాలను అతలాకుతలం చేసి వెళ్లిపోయిన అనంతరం పంచాయతీలు పరిశుభ్రతపై దృష్టి పెట్టాయి. మండల అభివద్ధి అధికారిణి దయాల సుహాసిని, మండల ఇన్చార్జి ఈవోపీఆర్‌డిగా విధులు నిర్వహిస్తున్న మంత్రిపాలెం (రెగ్యులర్), కూచిపూడి (ఎఫ్.ఎ.సి), నిడుమోలు(ఎఫ్ .ఎ.సి) కార్యదర్శి ఈడే వీర హనుమాన్ గౌడ్‌ల ఆదేశాలతో గురువారం మండలంలోని 21 గ్రామాలలో శానిటేషన్ క్లోరినేషన్ నిర్వహించారు. మండలంలో మేజర్ గ్రామాలైన మొవ్వలో కార్యదర్శి కేవీ సోమేశ్వరరావు, కోసూరులో ఎన్ శ్రీలక్ష్మి, కాజలో రాంబాబు, పెదపూడి, అయ్యంకి, భట్ల ,పెనుమద్రు పెడసనగల్లు గ్రామాల కార్యదర్శి అయిన వి ప్రభు కుమార్, కూచిపూడి, మంత్రి పాలెం, నిడుమోలులలో హనుమాన్ గౌడ్ ల పర్యవేక్షణలో శానిటేషన్, లైట్లు వేయడం కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే మైనర్ పంచాయతీల్లో గ్రేడ్ 5 కార్యదర్శిల పర్యవేక్షణలోఈ కార్యక్రమాలు కొనసాగాయి



అపార్ట్‌మెంట్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ-పామర్రు రోడ్డులోని శ్రీ అష్ట లక్ష్మి అమ్మవారి దేవస్థానం వద్ద నూతనంగా నిర్మించనున్న అష్టలక్ష్మి సిగ్నేచర్ టవర్స్ అపార్ట్మెంట్స్‌కు గురువారం తుమ్మల రత్న, తిరుపతిరెడ్డిల ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తుమ్మల రత్న దంపతులు మాట్లాడుతూ ఉషోదయ పబ్లిక్ స్కూల్‌ను ఆదరించినట్లు నూతనంగా నిర్మిస్తున్న వెంచర్ను ప్రజలు ఆదరించాలన్నారు. వేద పండితులు శ్రీమాన్ మురళీకృష్ణమాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియం ఉపా ధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



పంటలు పరిశీలన

ప్రజాశక్తి-వీరులపాడు : వీరులపాడు మండలంలో జుజ్జూరు, చెన్నారావుపాలెం, అల్లూరు గ్రామాల్లో గురువారం రైతు సంఘం నాయకులు పర్యటించారు. మొంథా తుపాను వల్ల నష్టపోయిన పత్తి, మొక్కజోన్న, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ నష్టపోయిన పంటలకు ప్రభుత్వ అధికారులు ఎనిమిరేషన్ చేసి నష్టపరహారాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పతికి ఎకరానికి రూ.50 వేలు, మొక్కజొన్నకు రూ.30 వేలు, వరికి రూ.25 వేలు, ఇతర పంటలకు రూ.30 వేలు ప్రకటించాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని సన్నిధిలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి-మోపిదేవి : ప్రముఖ పుణ్య క్షేత్రం శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గురువారం దర్శించుకున్నారు. దేవస్థాన ప్రాంగణానికి విచ్చేసిన పవన్ కళ్యాణ్‌కు ఆలయ సూపర్డెంట్ అచ్యుత మధుసూదన్ రావు, ఆలయ అర్చక బృందం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పవన్‌కళ్యాణ్ ఆలయ ఆవరణలో గల నాగ పుట్టలో పాలు పోసి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. తరువాత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకుని, విశేష పూజలు నిర్వహించారు. దర్శనాంతరం ఆలయ అధికా రులు పవన్‌కళ్యాణ్‌కు ఘనంగా సత్కరించి, స్వామి వారి తీర్థప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందించారు.



పవన్‌కళ్యాణ్‌కు చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

ఆలయ ఉద్యోగుల వినతి పత్రం

రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ పరిధిలోని వివిధ దేవస్థానాలలో మినిమమ్ బేసిక్ వేతనంపై పనిచేస్తున్న సిబ్బందికి హెచ్‌ఆర్‌ఏ, డిఏ, వార్షిక ఇంక్రిమెంట్ లు, ఐఆర్ వంటి అలావెన్సు మంజూరు చేసి పూర్తి వేతన శ్రేణి ఇప్పించి తమను ఆదుకోవాలని కోరుతూ పవన్ కళ్యాణ్‌కు ఆలయ సిబ్బంది వినతిపత్రం అందించారు. ప్రసాద్, రమేష్ బాబు, శ్రీనివాస్, సోమ శేఖర్ పాల్గొన్నారు.

బండి రామకృష్ణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-పామర్రు: ఉమ్మడి కృష్ణాజిల్లా డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణకి పామర్రు నియోజకవర్గంలోని జనసేన నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మచిలీపట్నం జనసేన పార్టీ కార్యాలయంలో రామకృష్ణను కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్,పామర్రు మండల జనసేన పార్టీ అధ్యక్షులు గుంప గంగాధరరావు,రాపర్ల ఎంపీటీసీ సభ్యులు కొనపరెడ్డి సుబ్బారావు, తోట్లవల్లూరు మండల ప్రధాన కార్యదర్శి బర్మా అశోక్ ఉన్నారు.



బండి రామకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

చిట్టాల ఐలమ్మ పేరుతో బోర్డు ఏర్పాటు చేయాలి

మేయర్ భాగ్యలక్ష్మీకి 27వ డివిజన్ కార్పొరేటర్ మల్లేశ్వరి వినతి

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ కౌన్సిల్ తీర్మానం ప్రకారం దుర్గాపురం కళ్యాణమండపంనకు తెలంగాణా పోరాట యోధురాలు, రజకుల సామాజికవర్గానికి ఎనలేని సేవలు అందించిన చిట్యాల ఐలమ్మ పేరుతో బోర్డును ఏర్పాటు చేసి, కళ్యాణమండపాన్ని అన్ని విధాలుగా కాపాడాలని స్థానిక 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయిగుంట మల్లేశ్వరి కోరారు. ఈమేరకు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీకి స్థానిక నాయకులతో కలిసి కార్పొరేటర్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... స్థానిక 27వ డివిజన్‌లో కార్పొరేషన్ నిధులతో నిర్మించిన కళ్యాణమండపానికి 78/323 తీర్మానం ప్రకారం తెలంగాణాపోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ పేరుతో నామకరణం చేయడం జరిగింద న్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే, 28వ డివిజన్ కార్పొరేటర్ వత్తిడితో ఐలమ్మ పేరుతో నేమ్ బోర్డు ఏర్పాటు చేయడానికి అధికారులు ముందుకు రాలేదన్నారు. తాను పలు సార్లు చేసిన అభ్యర్థన మేరకు ఈ నెల 22న కార్పొరేషన్ అధికారులు పోలీసుల సాయంతో చిట్యాల ఐలమ్మ పేరుతో బోర్డు ఏర్పాటు చేశారని అన్నారు. అయితే నాలుగు రోజుల వ్యవధిలో ఈ నెల 26 ఆదివారం ఉదయం వెళ్లి చూడగా, చిట్యాల ఐలమ్మతో ఉన్న బోర్డును తొలగించి, దాని స్థానంలో రజక కళ్యాణమండపం అనే పాత బోర్డు ఒకటి దర్శనమిచ్చిందన్నారు. స్థానిక ప్రజలను విచారించగా... గత శనివారం (25వ తేదీ) రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చిట్యాల ఐలమ్మ బోర్డును తొలగించారని చెప్పడం జరిగిందన్నారు. డివిజన్ ప్రజల అభిమాన నాయకురాలు, వారి కోరిక మేరకు , ఎంతో చరిత్ర కల్గిన చిట్యాల ఐలమ్మ పేరుతో కళ్యాణమండపాన్ని నిర్మించి, ఆమె పేరుతో బోర్డు ఏర్పాటు చేయడానికి అధికార టిడిపికి చెందిన ప్రజాప్రతినిధులు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గజ్జలకొండ వాసు, కె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతులపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ మండలంలోని ప్రతి పాఠశాల హెచ్‌ఎంలు విద్యార్థుల ఆధార్ అప్‌డేట్, పాఠశాల మౌలిక వసుతులపై దృష్టి పెట్టి విద్యార్థులకు మంచి భోధన అందించాలని ఎంఇఓలు రజిని, బాలాజీలు అన్నారు. గురువారం స్థానిక ఎంఇఓ కార్యాలయంలో మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశాన్ని ఎంఇఓలు రజనీ, బాలాజిలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి పాఠశాలలో 10వ తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. పాఠశాలకు కావాలసిన మౌలిక వసతులను గుర్తించి వాటి సమాచారం అందజేయాలన్నారు. మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలు, కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

పెనుముచ్చ ట్రస్ట్ ద్వారా మెరుగైన సేవలు



ప్రజాశక్తి-పమిడిముక్కల : పెనుముచ్చ గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ,పెనుముచ్చ ట్రస్ట్ ద్వారా ఆరోగ్యం, విద్య, పారిశుధ్య పనులు వంటి మెరుగైన సేవలు అందిస్తున్నామని ట్రస్టు చైర్మన్ మొవ్వ రాము అన్నారు. గురువారం మండలంలోని పెనుమచ్చ గ్రామంలో తుఫాను బాధితులకు ఆహార పదార్థాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఆరోగ్య సేవలు, ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. గ్రామంలో పాఠశాల అభివద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడాలి మాధవి, నాగార్జున, సురేష్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన కడవకొల్లు



ప్రజాశక్తి-అవనిగడ్డ : మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని దివి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కడవకొల్లు నరసింహారావు గురువారం తాడేప ల్లిలోని వైయస్ జగన్మోహన్ రెడ్డి క్యాంప్ ఆఫీసులో జగన్మోహన్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ దివిసీమలో రైతులు ఎదుర్కొం టున్న కష్టాలు, మొం తా తుఫాను వల్ల సంభవించిన పంట నష్టం గురించి వివరిం చినట్లు చెప్పారు. తుఫాను వల్ల దివిసీమ రైతులు భారీ నష్టాన్ని ఎదుర్కొంటున్నారని, గత వైఎస్‌ఆర్సిపి ప్రభుత్వ కాలంలో ప్రభుత్వం స్వయంగా రైతుల పొలాలకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించిందని, అందువల్ల పంటలు నష్టపోయినప్పుడు వారికి భరోసా లభించిందని జగన్కు వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమనగడ్డ నియోజకవర్గం లోని పార్టీ పరిస్థితులు, స్థానిక సమస్యలపై కూడా జగన్మోహన్ రెడ్డికి వివరించానని, పార్టీని బలోపేతం చేయడంలో మరింత చురుకుగా పాల్గొనాలని జగన్ తనకు సూచించినట్లు నరసింహారావు తెలిపారు.

నివాస ప్రాంతాల్లోకి వరద నీరు రాకుండా చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ : నివాస ప్రాంతాలకు వరద నీరు రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుం టున్నట్లు నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మొంథా తుఫాను నేపథ్యంలో ప్రకాశం బ్యారేజి నుంచి కష్ణానది దిగువకు నాలుగు లక్షల క్యూసెక్కుల కంటే ఎక్కువగా నీరు విడుదలకావడం, మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినందున నగర పరిధిలోని కష్ణనది పరివాహక ప్రాంతం రాణిగారితోట, రామలింగేశ్వర నగర్, సాయిరాం కట్ పీసెస్, బసవతారక నగర్ ప్రాంతాలను ఇంజినీరింగ్, ఇతర శాఖల అధికారులతో కలిసి గురువారం కమిషనర్ పర్యటించి అక్కడి పరిస్తితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాణిగారితోట, రామలింగేశ్వర నగర్ వెంబడి రిటైనింగ్ వాల్ నుంచి సీఫేజ్ నీరు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సాయిరాం కట్ పీసెస్, పోలీస్ కాలనీ, భూపేష్ గుప్తా నగర్, రణధీర్ నగర్, మెట్ల బజార్ ప్రాంతాలలో మోటర్ల ద్వారా నీరు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సర్కిల్ 1 పరిధిలోని భవానిపురం చేపల రేవు వద్ద రెండు మోటార్లను ఏర్పాటు చేసి వరద నీరు నివాస స్థలానికి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ వారు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు సురక్షితమైన ప్రదేశాలలో నగరపాలక సంస్థ వారు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో వెళ్లాలని ప్రజలను కోరారు. అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి , జోనల్ కమిషనర్ కే షమ్మీ, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కే సంజయ్ రత్నకుమార్ పాల్గొన్నారు.



జాతీయ సమైక్యతకు స్ఫూర్తి వల్లభాయ్ పటేల్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా అతిపెద్ద ప్రచార యాత్ర డిజిటల్ దశను ప్రారంభించటం గర్వంగా ఉందని కేంద్ర క్రీడలు, యువజన సంక్షేమం, భారత్, జిల్లా యువజన అధికారి సుంకర రాము తెలిపారు. కలెక్టర్ రేట్ పిజి ఎస్ ఆర్ హాల్లో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని దేశవ్యాప్తంగా నిర్వహించే ప్రత్యేక ప్రచార కార్యక్రమాల్లో భాగంగా గురువారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో సుంకర రాము మాట్లాడారు. భారత చరిత్రలో ఇంతకుముందెన్నడూ లేనివిధంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజైన 31 అక్టోబర్ నుంచి నవంబర్ 25 వరకు అతి పెద్ద ప్రచారయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతలో ఐక్యత, దేశభక్తి భావాన్ని పెంపొందించే విధంగా అక్టోబర్ నెలలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, జిల్లాలలో సర్దార్ ఏ150 యూనిటీ మార్చ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ సమైక్యతకు స్ఫూర్తి సర్ధార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇవో ఆనంద్ కూమార్, దుర్గా ప్రసాద్, కృష్ణా యూనివర్సిటీ ఎన్ ఎస్ ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుంకర రాము

రేపు, ఎల్లుండి ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులోని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాజిలిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో శని, ఆదివారాలు ఉచిత వైద్య శిబిరాల్ని నిర్వహించ నున్నారు. ఈ శిబిరాల్లో ఎముకలు, కీళ్లు, నడుము, దంత, గుండె, హెూమియో, బీపీ, షుగర్, థైరాయిడ్, సాధారణ, మానసిక, నేత్ర వైద్య పరీక్షల వంటి వైద్యాన్ని ప్రముఖ కార్పోరేట్, మల్టీ స్పెషాలటీ హాస్పటల్స్‌లోని వైద్య నిపుణులచే అందించనున్నారని డాక్టర్ వెంకట్రావు గురువారం తెలిపారు. ఈ పరీక్షల్లో అవసరమైన రోగులకు ఉచిత మందులను కూడా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

రమేష్ హాస్పిటల్లో రాయితీతో న్యూరాలజీ వైద్య సేవలు



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఆస్టర్ రమేష్ హాస్పిటల్లో ప్రపంచ స్ట్రోక్ డే సందర్భంగా ఒక సంవత్సరం పాటు ఉచిత రాయితీలతో న్యూరాలజీ వైద్యసేవలు అందించనున్నట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.రమేష్ బాబు తెలిపారు. రింగ్ రోడ్డు వద్ద గల ఆస్టర్ రమేష్ హాస్పిటల్లో ఆయన గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ అక్టోబర్ 29వ తేదీని ప్రజల్లో స్ట్రోక్ పట్ల అవగాహన కలిగించేందుకు ప్రపంచ స్ట్రోక్ దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా స్ట్రోక్ కారణాలు, ప్రభావాలు, నివారణ, సమయానికి చికిత్స గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం సుమారు 18 లక్షల కొత్త స్ట్రోక్ కేసులు నమోదవుతున్నాయన్నారు. ప్రతి 6 సెకన్లకు ఒక వ్యక్తి స్ట్రోక్ కి గురవుతున్నారని తెలిపారు. అధిక రక్తపోటు, మధుమేహం, ధూమపానం, అధిక బరువు అదుపులో ఉంచుకుంటే 90 శాతం స్ట్రోక్స్ నివారించవచ్చని తెలిపారు. స్ట్రోక్ లక్షణాలు కనిపించిన 4 నుండి 5 గంటల్లో చికిత్స అందిస్తే 80 శాతం మంది పూర్తిగా కోలుకోవచ్చని తెలిపారు.



రైతులను ఆదుకునేందుకు చర్యలు : నెట్టెం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని గౌరవారం గ్రామ సమీపంలోని మొంథా తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి, కృష్ణా జిల్లా సహకార బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం గురువారం పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ గ్రీవెన్స్ సెల్ కో-కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, జగ్గయ్యపేట మండల పార్టీ అధ్యక్షుడు కట్ట వెంకట నరసింహారావు, అగ్రికల్చరల్ ఎడి భవాని, రైతులు పాల్గొన్నారు.

జియో-బిపి ఇవి ఛార్జింగ్ మొబిలిటీ కేంద్రం ప్రారంభం



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని జియో రిటైల్ అవుట్లెట్ లో ఈవీ ఛార్జింగ్ సమీకృత మొబిలిటీ కేంద్రాన్ని ప్రారంభించినట్లు జియో. -బిపి. సంస్థ ఛైర్మన్ సార్థక్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఇది దేశం పరిశుభ్రమైన, స్మార్ట్ ప్రయాణం దిశగా దేశ పరివర్తనలో ఒక ప్రధానమైన మైలురాయిని సూచిస్తుందని తెలిపారు. తొలుత బెంగుళూరులోని దేవనహళ్లి అవుట్లెట్ బహుళ-ఇంధనం రిటైల్ సైట్లో ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇది పెట్రోల్, డీజిల్, సీఎన్జీని అందించడమే కాకుండా ఆధునిక ఈవీ ఛార్జింగ్ వేదికను చేర్చిందన్నారు. 360 కిలోవాట్ వరకు పంపిణీ చేసే 28 ఛార్జింగ్ పాయింట్లతో అత్యంత వేగవంతమైన డీసీ ఛార్జర్స్ ను కలిగిఉంది అని తెలిపారు. ఈ ఫ్లాగ్ షిప్ గమ్యస్థానం ఇంధనం, సీఎన్జీ, ఈవీ, రిటైల్, కేఫ్ అనుభవాలను ఒకే చోటకు తీసుకోవచ్చి, కస్టమర్లు, ప్రయాణికులకు ఒకే విధంగా సౌకర్యాన్ని అందిస్తుందని అన్నారు ..

కొండ ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : కొండ ప్రాంత ప్రజల సంరక్షణ కోసం రక్షణ గోడల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొంథా తుపాను కారణంగా 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో చెట్టు నేలకొరిగిన ఘటనలో ధ్వంసమైన ఇళ్లను స్థానిక కార్పొరేటర్ బోయి సత్య బాబుతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఇల్లు దెబ్బతిన్న చెక్క వీరమ్మ, చెక్క వెంకన్న, రాము, లంకే సావిత్రమ్మ, దుర్గ కుటుంబ సభ్యులను పరామర్శించి సిపిఎం తరపున అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు. అనంతరం బాబూరావు మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వాలతోపాటు ప్రస్తుత ప్రభుత్వం కొండ ప్రాంత వాసులను ఓటు బ్యాంకుగా వాడుకోవడం మినహాయించి వారి సంక్షేమానికి కృషి చేసిన దాఖలాలు లేవంటూ విమర్శించారు. కొండ ప్రాంతాలలో ప్రమాదకరంగా మారిన ప్రదేశాలలో రక్షణ గోడలు నిర్మించాలని తమ పార్టీ నేతలు అనేకమార్లు పాలకులకు, కార్పొరేషన్ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. వర్షాలు కురిస్తే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కొండ ప్రాంతవాసులు బతుకుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుపేదలు నివసించే కొండ ప్రాంతాలలో రక్షణ గోడలు నిర్మించాలని, రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం రూ.100 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మొంథా తుపాను కారణంగా ధ్వంసమైన ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. జక్కంపూడి కాలనీలో ఖాళీగా ఉన్న జెఎన్ఎన్యుఆర్ఎమ్ ఇళ్లను కొండ ప్రాంత వాసులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్ బి.సత్యబాబు మాట్లాడుతూ పశ్చిమంలోని 22, 12వ డివిజన్లలోని కొండ ప్రాంతాల్లో పేదలు ఇల్లు నిర్మించుకొని జీవిస్తున్నారని గుర్తు చేశారు. కొండ ప్రాంతాలలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఇప్పటికే ఆమోదం పొందిన రక్షణ గోడలు నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. తుపాను ప్రభావంతో ఇల్లు దెబ్బతిన్న బాధిత కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని, రిటైనింగ్ వాల్ నిర్మాణాలతో పాటు బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఇవి.నారాయణ, కె.సూరిబాబు, సాంబశివరావు వున్నారు.



రైతులను ఆదుకుంటాం : సౌమ్య

ప్రజాశక్తి-కంచికచర్ల : మొంథా తుఫాన్ తో పాటు కష్టం, మునేరు వరదలకు పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ప్రభుత్వ విప్ నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. కంచికచర్ల మండలంలో గండేపల్లి, కీసర గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించి, తుపానుకు నష్టపోయిన పత్తి, మొక్కజొన్న పంటలు పరిశీలించారు. అనంతరం కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాంతో కలిసి గండేపల్లి, కసర, కంచికచర్లలో పునరావాస కేంద్రాల్లో ఉన్న తుఫాన్ బాధితులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కోగంటి బాబు, తహశీల్దార్ నరశింహారావు, సిఐ చవాన్, వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి ఆటల పోటీలకు ముష్టికుంట్ల విద్యార్థులు



ప్రజాశక్తి - తిరువూరు : మండల స్థాయి ఆటల పోటీలో తిరువూరు మండలం ముష్టికుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటి డివిజన్ స్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలు జరిగాయి. కబడ్డీలో సీ.హెచ్ యామిని, కె.శతి, ఎం.ప్రణతి, కె.అమృతరావు, కె.అఖిల్, జి. శ్రీధర్, ఎం.అక్షయ్ కుమార్, కె. అరుణ్ కుమార్, కె. రిషి. ఖోఖోలో కె.శ్యామ్ రాజ్, కె.అజయ్, కె.బిట్టు, కె.సందీప్, కె.లక్ష్మి ప్రసన్న, బి.ప్రవలిక, బి.పల్లవి, కె.అశ్విని, కె.భవిష్య దేవి, ఎం. అలేఖ్య, కె.అ మతరావు, ఎం.అక్షయ్ కుమార్, యు. జ్ఞానేంద్ర సాయి, కె. అఖిల్, జి.శ్రీధర్, బి. మన్మథరావులు ఆల్ రౌండ్ ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యా యులు బి.వీరభద్రరావు గురువారం విలేకర్లకు తెలిపారు. క్రీడాకారులను, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్ కృష్ణ ప్రసాద్, ఎం నరేష్ లను ప్రధానోపాధ్యాయుడు తో పాటు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అభినందించారు.

సురక్షిత ప్రాంతాలకు కరకట్ట ప్రజల తరలింపు

- విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలందరిని సురక్షితమైన ప్రదేశాలకు తరలించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం తన పర్యటనలో భాగంగా కృష్ణవేణి ఘాట్, క్రాంబ్వే రోడ్డు, హెచ్‌బి కాలనీ, చిట్టినగర్ సొరంగం, కేటీ రోడ్డు, నెహ్రూ రోడ్డు, లోబ్రిడ్జ్ ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ధ్యానచంద్ర మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా నదీ పరివాహక ప్రాంతంలోని ఉపనదులలో ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉందని, దానివలన కృష్ణా నదీ ప్రవాహం మరింత వేగంగా పెరిగే అవకాశం ఉందని, ఆ తట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలందరూ సురక్షితమైన ప్రాంతాలకు వెళ్లాలని తెలిపారు. అనంతరం హెచ్.బి.కాలనీలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించి, తాగునీటి సరఫరా, వాడుక నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని, అన్న క్యాంటీన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని, అన్న క్యాంటీన్లో వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకునే బాధ్యతను నోడల్ ఆఫీసర్లదని అన్నారు. ఈ పర్యటనలో డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్ర బోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో మహిళా ఉద్యోగుల పాత్ర కీలకం

- సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్.స్వర్ణలత



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేసే మహిళా ఉద్యోగులు, అధికారులు విధి నిర్వహణలో అందించే సేవలు ఎంతో కీలకమని, సమాచార పౌర సంబంధాల శాఖలో అత్యంత సమర్ధవంతంగా సేవలందించిన సూపరింటెండెంట్ ఎం.రూపవాణి, విజయవాడ రాష్ట్ర సమాచార కేంద్రం లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న జాస్తి వెంకటలక్ష్మి పనితీరు అభినందనీయమని సమాచారశాఖ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత అన్నారు. ఈ నెల 31న పదవి విరమణ చేయనున్న రూపవాణి, వెంకటలక్ష్మిలకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల కమిషనర్ కార్యాలయంలో గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అడిషనల్ డైరెక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేసే మహిళా ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని అని అన్నారు. ఇద్దరు మహిళా సిబ్బందికి పదవి విరమణ శుభాకాంక్షలను తెలియజేస్తున్నాని తెలిపారు. అనంతరం వెంకట లక్ష్మి ప్రసాద్ దంపతులను, రూపవాణిని సన్మానించారు. కార్యక్రమానిలో రాష్ట్ర సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ ఐ.సూర్యచంద్ర రావు డిప్యూటీ డైరెక్టర్లు బి.పూర్ణచంద్ర రావు వెంకట్రాజు గౌడ్, డి. రమేష్ భాస్కరనారాయణ ఎడిలు ఎస్ వి మోహన్ రావు, పి.రాజశేఖర్, ఎ.ఎస్ వీరభద్రరావు, ఎ.నారాయణరెడ్డి, డి ఐపిఆర్ఓ కె వి రమణ రావు, డిఎల్ పి ఆర్ ఓ కె.రవి, విశ్రాంత అధికారి ఎస్ శ్రీనివాస్ జీవన్ యితర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : విజయవాడ వన్ టౌన్లోని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ లో గురువారం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ పై అవగాహన సదస్సును కళాశాల విద్యార్థులకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా డి.యస్.పి ఎం వెంకటేశ్వర్లు, డి.యస్.పి యూ బంగారు రాజు, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎండి ఉమర్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఓ కిరణ్ కుమార్ హాజరయ్యారు. డియస్పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, న్యాయం, బాధ్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అవినీతి, అక్రమాలు, ప్రజా నిధుల దుర్వినియోగాన్ని గుర్తించి వాటిని అరికట్టడం ఈ విభాగం యొక్క ప్రధాన లక్ష్యమని వివరించారు. అధికారుల పనితీరును పర్యవేక్షించడం, చట్ట ఉల్లంఘనలకు సంబంధించిన విచారణలు జరపడం, మరియు ప్రజా ప్రయోజనాలను రక్షించడం ద్వారా ఈ విభాగం సమాజంలో న్యాయం స్థాపనకు తోడ్పడుతుంది. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం సమర్ధమైన పాలనను ప్రోత్సహిస్తుందని తెలియజేశారు.